# "ఒక్క రోజు"

ఒకే ఒక్క మల్లెపువ్వు అపురూపంగా అందించే సువాసనలా, ఒక గులాబీ స్పర్శ కలిగించే సుఖంలా మధురానుభూతిని కలిగిస్తాయి ఆచంట శారదాదేవి గారి కథానికలు. జీవితానుభవాల సూక్ష్మరూపాలు ఈ కథానికలు. జీవితాన్ని విస్తృతంగా, విశ్లేషణా పూర్వకంగా చిత్రించే పెద్ద కథలు కావు. ఆకాశంలో మిణుకు మిణుకు మనే నక్షత్రాల్లాగ, అనంతాకాశంలో ఒంటరి నక్షత్రంలాగా సంభ్రమాన్నీ, ఆవేదననీ కలిగించే కథానికలు వీరివి.

వీరి కథా వస్తువులన్నీ దాదాపు, స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించేవే. వివాహ వ్యవస్థపై ఆధారపడిన మన పురుషాధిక్య సమాజంలో, స్త్రీల నిస్సహాయ పరిస్థితినీ, నిశ్శబ్ద చైతన్యావస్థనీ సున్నితంగా, సమర్థవంతంగా చిత్రించిన శారదాదేవి గారి కథానికలలో ప్రత్యేకించి చెప్పుకోదగిన వెన్నో ఉన్నాయి- "పగడాలు, "జారిన నక్షత్రం, "జాలి గుండె' ', "దిగుడుబావి", "నిద్రలేని రాత్రి", "బ్రతుకు తీపి", మొదలైనవి. అయితే, 1960 లోనూ, 1969 లోనూ వచ్చిన రెండు కథాసంపుటాల్లోనూ చోటుచేసుకున్న "ఒక్కరోజు" అనే కథానికని మరీ ముఖ్యంగా చెప్పుకోవాలి. మధ్య తరగతి సంసారాల్లో వివాహిత స్త్రీ సామాన్యంగా పొందే అనుభవాన్ని చిత్రించిన ఈ చిన్న కథలో' జీవితతత్వాన్నీ, ఆనందానికి సూక్ష్మమార్గాన్నీ సునాయాసంగా సూచించడం ఈ రచయిత్రి ప్రతిభకి తార్కాణం. "పగడాలు' ', మొదలైన మంచి కథలు తెలుగు పాఠకులనేకమందికి గుర్తున్నవే. "ఒక్కరోజు' ' మరోసారి గుర్తుచేసు కోదగిన కథానిక.

"స్త్రీ హృదయంలో ఉండే అనుస్యూత సంస్కృతి, అజ్ఞాత వాంఛలు, అవ్యక్త భావ తరంగములు, అసమాన లాలిత్యము, అవ్యాజ కారుణ్యము, అఖండత్యాగము - చక్కగా నిరూపించారు ...." అని ప్రశంసించారు జస్టిస్ రాజమన్నారు. శారదాదేవి గారి కథలకు ముందుమాటలో. "ఈమె ఆంటన్ చెహోవ్, కాథరీన్ మాన్స్‌ఫీల్డ్ వంటి కథకు లకోవకు చెందిన "రచయిత్రి అని శ్రీ బుచ్చిబాబు కీర్తించారు. అంతే కాదు. "సమాజం ప్రతి పాదించిన నైతిక నియమాలని అతిక్రమించ కుండా, కొత్తకోణాలనుండి అనుభవాన్ని కాంక్షించడం, మెళకువతో అనుభూతిని పొందడం, ఎప్పుడూ ఏదో వొక ఆదర్శం లక్ష్యంగా ఉంచుకుని, అది లభ్యంకాక పోయినా కూడా, విముఖతతో శూన్యంలోకి దిగజారిపోకుండా, జీవితపుటంచులను పరామర్శిస్తూ, ప్రాకృతిక ఆనందాన్ని సాధించగలగాలన్న ఉబలాటం - ఇవీ ప్రతి కథలోనూ వ్యక్తమవుతుంది" - అని విశ్లేషించారు బుచ్చిబాబు. ఇందుకు చక్కని ఉదాహరణ "ఒక్కరోజు" కథ.

"...అనవసరమైన వర్ణనలు, వ్యాఖ్యానాలు, సిద్ధాంతాలు, చమత్కారమైన సంభాషణల కూర్పు కోసం పెనుగులాట, దిగ్భ్రమ కలిగించే ముగింపులు, కృత్రిమ మనస్తత్వ నిరూపణం, భాషతో కుస్తీలు, నిర్మాణంలో కసరత్తు, ఇవి లేకపోవడం, వీటిలో నిజాయితీ, వీటి అందం. శారదాదేవికి జీవితంలోతులు తెలుసు..." అని శారదాదేవిగారి రచనాశైలినీ, కథానికల విశిష్టతనీ స్పష్టం చేశారు బుచ్చిబాబు గారు.

"ఒక్కరోజు" కథలో ఆ 'నిజాయితీ', 'అందం' కనిపిస్తాయి. 'కథ ఏముంది ఇందులో' అనిపించే, మామూలు కథలూ కనిపించే ఈ కథానికలో ఒక అమూల్యమైన జీవన సూత్రం లభిస్తుంది.

ఇంట్లో నిత్య కృత్యాలతో, పతిసేవతో, పిల్లలసేవతో సతమతమయే గృహిణికి క్షణం తీరిక ఉండదనే విషయం ఎవరికీ పట్టదు. నిద్ర బద్ధకం వదలక పోయినా పొద్దున్నే లేవక తప్పదు. ప్రతిరోజూ యథావిధిగా పనులు నిర్వర్తించాల్సిందే. "ప్రతి రోజూ ఏదో మార్పు వస్తుందని వట్టి భ్రమ. కాస్త మార్పు కోసం స్నేహితురాలితో కలిసి మల్లెతోటలోకి వెళ్లాలనుకుంటే ఏ పూటకాపూటే ఏదో ఒక అడ్డంకి. పిల్లవాడికి జ్వరమో, భర్త అవసరాలో ఏదో ఒకటి. భర్త స్వయంగా ఏ పనీ చేసుకోడు. అన్నీ అందివ్వాలి, అన్నీ వెతికివ్వాలి. "కొంచెం ఇవన్నీ చూడకూడదూ! పుస్తకం చేతిలో పట్టుకుని నిద్రపోకపోతే!" అంటాడు భర్త. భర్త వర్ణించే ఈ మామూలు పాఠం ఆ గృహిణికి కంఠతావచ్చు. రాత్రి కాగానే, "పొద్దున్న అనవసరంగా విసుక్కున్నా" అనీ, "రేపటి నుంచినిన్ను ఒక్కమాట అంటే ఒట్టు" అనీ అంటాడు ప్రేమగా. "రేపు వస్తుంది. ఈ వేళ చేయలేకపోయిన వెన్నో రేపు చేయవచ్చు... నిన్న, ఇవ్వాళ, రేపు- వీటిలో నిజంగా ఏమీలేదు... కాని ఈ రాత్రి, ఈ చల్లదనం, ఈ ఆశ లేకపోతే!..." అనుకుంటుంది ఆ గృహిణి. జీవితంలో కలిగే నిస్పృహని ఏరోజు కారోజు నవ్వుకుంటూనే దిగమింగుతూ ఆశాజీవిగా బ్రతుకు సాగిస్తుంది ఆ యిల్లాలు.

విద్యావంతులూ, ఉద్యోగస్థులూ అయిన స్త్రీల సంఖ్య పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా చాలామంది గృహిణుల పరిస్థితి శారదాదేవి గారు చిత్రించినట్లు గానే ఉంది నేటికీ. సుఖజీవనం సాగించాలంటే, స్త్రీలకే కాదు, పురుషులకైనా ఇటువంటి సదవగాహనతో కూడిన ఆశావాదం అవసరమే.

-అబ్బూరి ఛాయాదేవి

---

# ఒక్కరోజు

## ఆచంట శారదాదేవి

అప్పుడే తెల్లవారుతూంది. కిటికీలోనుంచి ఒక్క వెలుగు కిరణం శాంత ముఖంమీద పడింది.


శాంతకు మెలుకువ వచ్చింది. అయినా నిద్దురబద్ధకం వదలలేదు. నిద్ర కళ్ళతోనే కిటికీలోనుంచి బయటికి చూసింది.

నిద్రకళ్ళతోనే మందార పువ్వులు పలకరించినాయి. ఒక్కక్షణం ఆమె హృదయం అటువైపు ప్రశాంతిలో లీనమయింది..........

ఉన్నట్టుండి మిన్ను విరిగి మీదపడినట్లు ఏకరణ గొణ ధ్వని : దొడ్డివైపునుంచి "కావు కావు"మంటూ కాకుల సమూహం, వీధివైపు నుంచి "బొంయ్"మంటూ కార్ల సమూహం. బావిదగ్గిర పంచమ శృతిలో పనిమనిషి. వాకిలి దగ్గర మధ్యమ శృతిలో కూరల మనిషి. అందరూ రకరకాల గొంతుకలతో ఇంక ప్రపంచంలో శాంతిలేదని "బృందగానం" మొదలుపెట్టారు, ఆ గోలకు ఎవరికైనా మెలకువ వస్తుంది. శాంతకు మెలకువతో పాటు ఆమెను నిత్య జీవితంలో బాధిస్తున్న సమస్యలన్నీ ఒక్క పెట్టున ఆవరించాయి.

ఎప్పుడూ రాత్రి .... ఎప్పుడూ నిద్ర అయితేనే బాగుంటుందేమో! అప్పుడు సమస్యలేమీ వుండవు. ఆశ, నిరాశ, అసంతృప్తి వీటి బాధేమీ వుండదు. కాని రాత్రి అంతా వేకువకోసం, పగలంతా రాత్రికోసం కనిపెట్టుకుని వుండడమే జీవితం!

అయినా ఇవ్వాళ! ప్రతిరోజూ ఏదో మార్పు




వస్తుందని వట్టిభ్రమ. అన్ని రోజుల్లాగే ఈ రోజూ గడచిపోతుంది. అంతే....

మామూలుగానే మేతదిగి వచ్చింది. మామూలుగానే రమణమ్మ కూరలు బేరం చేస్తోంది.

"బెండకాయలు అరణాల కిస్తావా?"

"అదేంటండీ. వీశ ముప్పావలా అమ్ముతుంటేను"

ఈ కబుర్లకేంలే, అరణాలకిస్తే ఇయ్యి అరవీశ!' ' అబ్బే. ఇదేం బేరమండీ అన్నీ మండిపోతుంటేను"

అంతే! విసుగొచ్చి తను కలుగజేసుకుని తీర్పు చెప్పేదాకా ఆ వాదన అట్లా సాగుతూనే వుంటుంది. రోజూ ఈ ఘోషలేకుండా వుండేందుకు కూరలకు ఎంత ధర ఇచ్చినా ఇవ్వవచ్చు!

త్వరగా స్నానంచేసి తల దువ్వుకుంది. ఇవ్వాళ రాణీ తనూ కలసి మల్లెతోటలోకి వెళ్ళాలనుకున్నారు .... తెల్ల వారేసరికి పువ్వులన్నీ విచ్చివుంటాయి. ప్రొద్దుటిపూట తోట ఎంత బాగుంటుందో! ఆ పువ్వుల వాసన తలచుకుంటేనే ఆమెకు వింతమత్తు కలిగింది.....ఏనాడు మొట్టమొదటిసారి ఆమె హృదయం మల్లెపూవులతో స్నేహం చేసుకొన్న దోకాని మల్లెపూవులను చూసినప్పుడల్లా ఆమె హృదయం వుప్పొంగిపోతుంది.....

తోటలోకి వెళితే, - అమ్మయ్య ! ఒక్క గంటసేపయినా ఈ కలవరాన్నంతా మరచిపోయి విశ్రాంతిగా వుండవచ్చు.....

బాబు వచ్చాడు.

"అమ్మా! తల నొప్పిగావుందే'

శాంత నుదుటిమీద చెయ్యివేసి చూసింది. మసలిపోతున్నది.

"పడుకోబాబు జ్వరం వచ్చినట్లుంది"

బాబును పడుకోబెట్టి, డాక్టరుకు కబురుచేసింది.

"అమ్మా, ఎక్కడికీ వెళ్ళకు. ఇక్కడే వుంటావు కదూ?"

"ఎక్కడకూ పోనురా. ఇక్కడే వుంటాను,' ' అక్కడే కుర్చీలో చతికిలబడింది. ఈ జ్వరం అనుకోకుండా ఈవేళే రావాలా? ఏమో! ఇది కాకపోతే ఇంకేదైనా అడ్డువచ్చి వుండవచ్చును. ఎంత ప్రయత్నించినా ఈ బంధనలోనుంచి తప్పించుకోలేదు. పాపం రాణి తనకోసం ఎదురుచూస్తూ వుంటుందేమో! డాక్టరువచ్చి చూసి మందిచ్చి వెళ్లేడు. ప్రమాదమైన జ్వరమేమీకాదు. సాయంత్రానికి తగ్గిపోవచ్చు. బాబు నిద్రపోయాడు. కాని ఈ పాటికి రాణి వెళ్ళిపోయి వుంటుంది.

రమణమ్మ వచ్చింది. ప్రక్కఇంటివాళ్ళు మళ్ళీ నిన్న రాత్రి మన చెట్టు అరిటాకులు కోసుకున్నారు."

"పోనీలే, వారింటికి రాత్రి మళ్లీ చుట్టాలొచ్చారేమో!".

"మళ్ళీ ప్రొద్దున్న ఎంగిలాకులన్నీ మనదొడ్లోనే పడవేశారమ్మా".

రమణమ్మకు ఉద్రేకం ఆగడంలేదు. "పోనీలే పనిమనిషిని ఎత్తమను."

ఊరుకోక! ...... ఏం చెయ్యాలి? వాళ్ళతో పోట్లాడాలా? అది తనకు ఈ జన్మలో సాధ్యమయ్యేది కాదు. రమణమ్మ తన ఉద్దేశం చెప్పింది.

"ఏమైనాసరేనమ్మా ఇవాళ మీరు అడిగితే అడగండి. లేకపోతే నేను నోరు చేసుకోక తప్పదు."

శాంత అదిరిపడింది.

రమణమ్మ అనుకున్నది మార్చటం ఎవరికీ చేతకాదు. ఆవిడ తీర్మానానికి ఫలితం ఏమిటో శాంతకు బాగా తెలుసు. ఇటు రమణమ్మ ఒక్క నోరుచేసుకుంటే అటువారు పది నోళ్ళు చేసుకోవటం, ఈ గొడవ భరించలేక ప్లీడరుగారు తనమీద విరుచుకుపడటం! ఇది మామూలే! ఇంక ఆరోజుకు శాంతి వుండదన్నమాట.

"రమణమ్మా!"

ఉహూ! ఆవిడ అప్పుడే దొడ్లో యుద్ధం ప్రకటించింది. ఇంక ఎంత అరచినా ఆవిడకు వినిపించదు. చెవిటివాడి దగ్గర శంఖం వూదినట్లే. వీధివైపునుంచి ప్లీడరుగారి కేకలు వినబడుతున్నాయి.

"ఏమిటాగోల ! ఇల్లా ! చేపల బజారా!' ఇదీ వరస.


ఈ గొడవలోనుంచి తప్పించుకుని ఎక్కడికైనా పారిపోవాలనుకున్నది. కాని వంటయింటికి కచ్చేరి సావిడికీ మధ్యవున్నది ఒక్కటే గది కాబట్టి అక్కడే ఆగిపోవలసి వచ్చింది.

తుఫాను అణిగింది.

నా చెప్పులేవీ?"

చెప్పులు బహుశః మేడమీద పడకగదిలో దొరకవచ్చు. రోజూ అవి అక్కడకు ఎలా వెళతాయో మాత్రం ఎవరూ చెప్పలేరు.

ప్లీడరుగారు మొదలు పెట్టారు :




పరధ్యానంగా ఏదో పుస్తకం పట్టుకుంది. తనకు తెలియకుండానే పేజీలు తిప్పుతోంది. కాని ఏమీ అర్థమయ్యేటట్లులేదు.

"నా రేజరు బ్లేడు చూశావా?"

ఉలిక్కిపడింది.

ఎప్పుడూ ఇంట్లో ఏమూల చూచినా రేజరు బ్లేడులే ఉంటాయి. కాని ప్లీడరుగారికి కావలసినప్పుడు మాత్రం ఒక్కటీ కనబడదు. రోజూ చూస్తున్నా ఈ విచిత్రం శాంతకు వింతగానే వుంటుంది.

"నా కెందుకండీ మీ బ్లేడు!" ----

"ఏమన్నా కూరలు తరుక్కుంటావా" అని మెల్లిగా కుంది. ప్లీడరుగారు బీరువాలో పుస్తకాలన్నీ తీసి ఒక్కొటొక్కటీ క్రింద గిరవాటు వెయ్యడం మొదలు పెట్టారు.'

"అబ్బే పుస్తకాల బీరువాలో ఎందుకుంటుందండీ."

"నీ కెందుకు! నువ్వు వెతక్కపోగా పైగా!'

మాట్లాడకుండా వెళ్ళిపోయింది. తను బ్లేడు వెతుక్కొచ్చేసరికి ప్లీగరుగారు బీరువా ఖాళీచేశారు. అమ్మయ్య మళ్ళీ పుస్తకం తీసుకోబోయింది.

"నా జేబురుమాలు చూశావా?"

చూడలేదు. కాని ఇప్పుడు చూడాలి, కాని ఎక్కడ వున్నదని ! ప్లీడరుగారు సణుక్కుంటున్నారు.

"నెలకు రెండు డజన్లు కొనుక్కుంటాను. కాని సమయానికి ఒక్కటైనా" - అలమారలోని ఇస్త్రీబట్టలూ, బుట్టలోని మాసిన బట్టలూ, అన్నీ బయటకు వచ్చిన తర్వాత జేబురుమాలు ప్లీడరుగారి జేబులోనే దొరికింది.

"ఎవరూ నా సంగతి కనుక్కునేవాళ్లేలేరు. కొంచెం ఇవన్నీ చూడకూడదూ! పుస్తకం పట్టుకుని నిద్రపోకపోతే!".

ఇది మామూలు పాఠమే! ఇదంతా శాంతకు కంఠతా వచ్చు! రోజూ జాగ్రత్తగా వుండాలని అనుకొంటూనే వుంటుంది. రోజూ మర్చిపోతూ నే వుంటుంది....

వీధి తలుపు ఫెడేలుమని చప్పుడైంది. ఇల్లంతా అరణ్యంలాగా వుంది. చుట్టూ ఇస్త్రీ బట్టలూ, మాసిన బట్టలూ, పుస్తకాలూ, న్యూస్‌పేపర్లూ! మధ్యన చతికిలబడింది. అవన్నీ తన్ను చూచి నవ్వుతున్నట్లుంది. తనకూ నవ్వువచ్చింది. ఏదో ఈ కోర్టు అనీ, ఆఫీసుఅనీ వుండబట్టి సరిపోయిందికాని, ఈ మగవాళ్లు ఇరవైనాలుగు గంటలూ ఇంట్లోనే వుండేటట్లయితే!

నవ్వుకుంటూలేచి ఇల్లంతా సర్దుకుంది. వెళ్లి బాబు దగ్గర కూర్చున్నది. ఎండ మాడిపోతున్నది. తోటలో చెట్లన్నీ ఈ ఎండకు తట్టుకోలేక, తప్పించుకోలేక, వాడిన ముఖాలతో ఆయాసపడుతున్నాయి. చివరకు అలసిపోయి ఈ యెండలో ప్రాణాలు నిల్పుకోలేమని నిరాశతో తలలు వాల్చుకున్నాయి, అప్పటికి సూర్యుడు దయదల్చి చల్లబడ్డాడు.

మధ్యాహ్నంనుంచి రమణమ్మగారి గొంతు వాగుతూనే వుంది.

"కుళాయి గొట్టం విరిగిపోయింది. నీళ్ళన్నీ ఇల్లంతా నిండిపోయాయి. వంటిల్లు చెరువ లాగ వున్నది. ఒక్కసారి వచ్చి చూడమ్మా".....


"స్టోరు రూము తలుపు బిగుసుకుపోయింది. ఎంతతోసినా రావడంలేదు"....

"పాలన్నీ పిల్లి తాగిపోయింది. ప్లీడరుగారికి కాఫీ లేదు".......

"బాబుకు జావకావాలి. గొధుమరవ్వ లేదు."...

"నిన్నటినుంచి చిన్న వెండిగిన్నె కనబడ దం లేదమ్మా! ఏమైపోయిందోగాని!"...

చిన్నచిన్న విషయాలను పెద్దపెద్ద సమస్యలుగా తయారు చెయ్యడం ఒక్క రమణమ్మకే చేతనవును! అయినా ఈ చిన్న విషయాలే ఎంత బాధ, ఎంత చిరాకు కలిగి స్తాయి.




ఇవ్వాళ మాత్రం ఈ ప్రశ్నలేవీ శాంత, చెవిలో దూరటంలేదు.

పని మనిషి కూతురు పన్నెండేళ్ళ నరిసి జ్ఞప్తికొచ్చింది.

"నరిసీ, నీకు ఆ మల్లెపువ్వు లెక్కడివే?'

"మా బావ తెచ్చాడమ్మా!"

"ఏం చేస్తాడు మీ బావ?"

"ఏం పని లేదమ్మా! ఎవ్వరైనా కూలికెల్తాడు, మీకు కావాలమ్మా మల్లెపూలు?'

"నా కెందుకే!"

తనకెందుకు? వాతావరణంలోకి మల్లె పూలు రాకూడదు...

మల్లె పువ్వులు ఒక జ్ఞాపకం! ఒక అందుకోలేని ఆదర్శం. అవి నిత్యజీవితంలోకి వస్తే వాడిపోతాయి. తను ఎక్కడవున్నా తనకు మల్లెపూల వాసన కొడుతూనే వుంటుంది, ఆ వాసన తలుచుకుంటూనే ఈ జీవితాన్ని గడపగలదు!

సాయంత్రం మబ్బుగావుంటే వర్షం కురుస్తుందేమో ననుకుంది. కాని మబ్బులన్నీ విడిపోయి వెన్నెల వచ్చింది. డాబామీద నక్షత్రాల కేసి చూస్తూ పడుకొంది. తెల్లవార్లూ అల్లాగే చందమామను, నక్షత్రాలనూ చూస్తూ గడపగలదు. రోజూ చూస్తున్నప్పటికీ వీటి ఆకర్షణ తగ్గదు... అబ్బ! ఈ వెన్నెల ఎంత హాయిగావుంది. నీలి పట్టుచీరమీద జరీ పువ్వుల్లాగ ఈ నక్షత్రాలు ఎంత బాగున్నాయి!

"ఇక్కడున్నావా!" ప్లీడరుగారి గొంతు!

"బాబుకు జ్వరం తగ్గిందికదూ!"

"ఆ! చెమట్లు పోస్తున్నాయి. నిద్రపో తున్నాడు".

ఏమీ తోచక ఆకాశంకేసిచూస్తూ కూర్చున్నా డు. కాసేపే ---- "చూడు, ప్రొద్దున్న అనవసరంగా విసుక్కున్నా".

శాంత చిరునవ్వు నవ్వింది. తెల్లవారే వరకు ప్లీడరుగారు పరమ శాంతమూర్తి.

"ఎందుకు నవ్వుతావు?....చూడు! రేపటినుంచి నిన్ను ఒక్కమాట అంటే ఒట్టు'

రేపటినుంచి!

"రేపు"!

శాంత హృదయం ఒక్కసారి ఉత్సాహంతో ఉప్పొంగింది. తెల్లవారుతుంది. రేపు వస్తుంది. ఈవేళ చేయలేకపోయినవెన్నో రేపు చెయ్యవచ్చు....రేపు మల్లెతోటకు వెళ్ళవచ్చు రేపు వీణ వాయించుకోవచ్చు. మరచిపోయిన పాటలన్నీ మళ్ళీ జ్ఞాపకం చేసుకోవచ్చు.....

ఈ ఆశతో ఆమె హృదయం తృప్తిపొం దింది.

నిన్న, ఇవ్వాళ, రేపు ----వీటిలో నిజంగా ఏమీ తేడాలేదు. అయినా ఇవ్వాళ గడచిపోయి నదని నిట్టూర్పు రేపు వస్తుందని ఆశ.

కాని ఈ రాత్రి, ఈ చల్లదనం, ఆ ఆశ లేక పోతే!......

